సాక్షి
వైఎస్సార్ జిల్లా

బుధవారం । 8 । మే । 2024



వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ
ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. బద్వేలు సుందరయ్యకాలనీలో వంద కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. - 8లో



నేను లోకల్
నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాను. అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తాను అని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
42.7/33.8

వాతావరణం
జిల్లాలో మంగళవారం 33.8 - 42.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

794 ఫిర్యాదులకు పరిష్కారం

కడప సెవెన్‌రోడ్స్‌: జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై మొత్తం 813 ఫిర్యాదులు అందగా 794 ఫిర్యాదులకు పరిష్కారం అందించామని జిల్లా ఎన్నికల అధికారి విజయ్‌ రామరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 ప్రోగ్రెస్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.

- సి–విజిల్‌ ద్వారా మొత్తం 501 కేసులు నమోదు కాగా అందులో 317 నిజనిర్ధారణ కాగా, 184 నిరాధారమైనవిగా గుర్తించారు.
- ఎఫ్‌ఎస్‌టి, ఎస్‌ఎస్‌టి., పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్‌ టీమ్స్‌ ద్వారా చేపట్టిన సీజర్‌ మేనేజ్మెంట్‌ ప్రక్రియ ద్వారా కోడ్‌ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రూ. 3,98,44,265ల మేర నగదు, రూ.7,73,36,091ల విలువైన లిక్కర్‌, ఇతర వస్తువులను సీజ్‌ చేయడం జరిగిందని, అలాగే 1,278 ఎఫ్‌ఐఆర్‌ కేసులు నమోదు చేశామని వివరించారు.

కొనసాగిన పోస్టల్‌ బ్యాలెట్‌

కడప సెవెన్‌రోడ్స్‌: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగ సిబ్బంది మూడవ రోజైన మంగళవారం జిల్లాలో పోస్టల్‌ బ్యాలెట్ల ద్వారా తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. జిల్లాలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్‌ కేంద్రాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌ జరిగింది. ఉద్యోగులు బారులు తీరి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. వివిధ కారణాల వల్ల పోస్టల్‌ బ్యాలెట్‌ కోసం దరఖాస్తు చేయడంలో ఆలస్యమైన ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇంకా జిల్లాలో పోస్టల్‌ బ్యాలెట్‌ వినియోగించుకోని ఉద్యోగులు బుధవారం కూడా వినియోగించుకునే అవకాశాన్ని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు కల్పించారు. పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు, మైక్రో అబ్జర్వర్లుగా నియమితులైన ఏ ఒక్కరూ మిస్‌ కాకుండా ఉండేందుకు ఈ అవకాశాన్ని కల్పించారు. ఇకపోతే జిల్లాలో 878 మంది దివ్యాంగులు, 85ఏళ్లు పైబడిన వారికి హోమ్‌ ఓటింగ్‌ కార్యక్రమం కింద ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం భారత ఎన్నికల సంఘం కల్పించింది. తొలిసారిగా జిల్లాలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో రెండవరోజుకూడా పలువురు వృద్ధులు, వికలాంగుల ఇంటి వద్దకు అధికారులు వెళ్లి పోస్టల్‌ బ్యాలెట్‌ అందజేశారు. ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు.

నేడు కూడా పోస్టల్‌ బ్యాలెట్‌ దుపాయం

కడప సెవెన్‌రోడ్స్‌: ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది బుధవారం కూడా పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటు నమోదు చేసుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేటాయించిన షెడ్యూలు ప్రకారం ఇప్పటికే పోస్టల్‌ బ్యాలెట్‌ కోసం ఫారం- 12 దరఖాస్తులను అనివార్య కారణాల వల్ల సమర్పించలేని వారు, అలాగే ఫారం–12 సబ్మిట్‌ చేసి 5, 6, 7 తేదీల్లో పోస్టల్‌ బ్యాలెట్‌ నమోదు చేసుకోలేకపోయిన ఎన్నికల అధికారులు, సిబ్బంది తమ ఓటును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. తమకు ఓటు హక్కు కలిగిన నియోజకవర్గ కేంద్రాల్లో రిటర్నింగ్‌ అధికారుల వద్ద ఫారం–12 సబ్మిట్‌ చేసి సంబంధిత నియోజకవర్గ ఫెసిలిటేషన్‌ సెంటర్లలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని వివరించారు. పోస్టల్‌ బ్యాలెట్‌ వేసేవారు ఎన్నికల విధుల అపాయింట్మెంట్‌ ఆర్డర్‌తో పాటు, ఓటరు ఐడి , ఆధార్‌, ఎంప్లాయ్‌ ఐడీ కార్డ్‌ తీసుకురావాలని పేర్కొన్నారు.

జేవీవీ పీపుల్స్‌ బుక్‌లెట్‌ విడుదల



బుక్‌లెట్‌ విడుదల చేస్తున్న జేవీవీ ప్రతినిధులు

కడప కల్చరల్‌ : జన విజ్ఞాన వేదిక పీపుల్స్‌ మ్యానిఫెస్టో పేరిట బుక్‌లెట్‌ను విడుదల చేసింది. మంగళవారం సంస్థ సీనియర్‌ నాయకులు డాక్టర్‌ రాజా వెంగళరెడ్డి, డాక్టర్‌ ఓబుల్‌రెడ్డి, శ్యామ్‌, డాక్టర్‌ ప్రసాద్‌రాజు, రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌ రాహుల్‌ దీన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజా వెంగళరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు మంచి విద్య, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం పట్ల ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా వారిని మద్యం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంచాలన్నారు. అధిక ధరల నుంచి ప్రజలను విముక్తి చేయాలని, వాతావరణ కాలుష్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. డాక్టర్‌ ఓబుల్‌రెడ్డి , రాజశేఖర్‌ రాహుల్‌ మాట్లాడారు. సభ్యులు అరుణ, సరస్వతి, సునీత, దేవదత్తం, సమీర్‌బాష, రంగనాయకులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులురెడ్డి, సుందరయ్య, శివరాం, మధుసూదన్‌ తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా.. గెలిచేట్టుగా!

- రంజుగా కమలాపురం రాజకీయం
- హ్యాట్రిక్‌ దిశగా పోచిమరెడ్డి రవీంద్రనాథరెడ్డి
- ఆపసోపాలు పడుతున్న తెలుగుదేశం పార్టీ
- పుత్తా తనయుడిని అభ్యర్థిగా ప్రకటించినా కలిసిరాని వైనం
- మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, సాయినాథశర్మ వైఎస్సార్‌సీపీకి అదనపు బలం
- ఆరు మండలాల్లో పుంజుకున్న అధికార పార్టీ
- జిమ్మిక్కులకు పరిమితమవుతున్న పుత్తా చైతన్యరెడ్డి





సాక్షి ప్రతినిధి, కడప: కమలాపురం రాజకీయం రంజుగా మారింది. గెలుపు గుర్రాలుగా ఉన్న వారంతా చేయి చేయి కలిపారు. మరోవైపు ప్రజామద్దతు అధికార పార్టీకి లభిస్తోంది. వరుసగా ఓటమి పాలవుతున్న తెలుగుదేశం పార్టీ ఈమారు అభ్యర్థిని మార్చింది. మళ్లీ అదే కుటుంబంలో తనయుడికి అప్పగించింది. అయినా ఆశించిన మద్దతు లభించడం లేదు. దీంతో ఉనికి కోసం తాపత్రయం కనిస్తోంది. తెలుగు తమ్ముళ్లకే పచ్చ కండువాలు కప్పుకుంటూ జిమ్మిక్కులు చేస్తున్నారు. హ్యాట్రిక్‌ సాధించాలనే తపనలో వైఎస్సార్‌సీపీ ఉంటే, టీడీపీ గెలుపు కోసం ఆపసోపాలు పడుతోంది.

- ఉమ్మడి వైఎస్సార్‌ జిల్లాలో అందరి చూపు కమలాపురం పైనే ఉంది. రాజకీయ చతురతలో ఆరితేరిన కమలాపురం ఓటర్లు ఎన్నికల్లో విజ్ఞతతో తీర్పు ఇస్తారు. అనేక ఎన్నికల ఫలితాల తీర్పు ఆ విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఇంతవరకు సౌమ్యులు, శాంతికాముకులకే పట్టం కట్టారు. దౌర్జన్యపరులను నిలువరిస్తూ వచ్చారు. ఇది ఎన్నికల రికార్డులను పరిశీలిస్తే తేటతెల్లమవుతుందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఈ పరిస్థితిలో పోటీలో అనేక మంది ఉన్నా, ప్రధానంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్య రసవత్తర పోరు నడుస్తోంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సిట్టింగ్‌ ఎమ్మెల్యే పోచిమరెడ్డి రవీంద్రనాథరెడ్డి పోటీ చేస్తుండగా టీడీపీ తరుపున పుత్తా నరసింహారెడ్డి తనయుడు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పోటీలో ఉన్నారు. అపార రాజకీయ అనుభవం పోచిమరెడ్డికి కలిసివచ్చే అంశంగా మారింది. మరోవైపు అంతే స్థాయిలో చతురత ప్రదర్శించే మాజీ ఎమ్మెల్యే గండ్లూరు వీరశివారెడ్డి, ఏపీఎస్‌ ఆర్టీసీ చైర్మన్‌ మల్లికార్జునరెడ్డి, సాయినాథశర్మ త్రయం ఈ ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. అసంతృప్తులను పార్టీకి చేరువ చేస్తూ ఎప్పటికప్పుడు చక్కదిద్దే పనిలో ఉన్నారు. ప్రత్యర్థి పార్టీ కంటే పైచేయి సాధించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే అన్ని మండలాల్లో వైఎస్సార్‌సీపీ ఊపు మీదుందని పరిశీలకులు భావిస్తున్నారు.

చరిత్ర తిరగరాయనున్న పోచిమరెడ్డి



పోచిమరెడ్డి రవీంద్రనాథరెడ్డి

కమలాపురంలో ఈమారు విజయం సాధించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పోచిమరెడ్డి రవీంద్రనాథరెడ్డి చరిత్ర తిరగరాయనున్నారు. ఈసారి విజయం సాధించడం ద్వారా హ్యాట్రిక్‌ ఆయన సొంతం కానుంది. ఈ రికార్డు ఇప్పటి వరకూ నియోజకవర్గంలో ఎవ్వరికి దక్కలేదు. అపార ప్రజా మద్దతు ఓ వైపు, అనుభవం ఉన్న నాయకుల మద్దతు మరోవైపు, సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ఉన్న సానుకూలత కలిసి రవీంద్రనాథ్‌రెడ్డి విజయానికి బాటలు వేయనున్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.



మల్లికార్జునరెడ్డి   వీరశివారెడ్డి   సాయినాథశర్మ

▶▶ కమలాపురంలో గణనీయమైన మార్పు..

నియోజకవర్గ కేంద్రమైన కమలాపురంపై టీడీపీ భారీ అంచనాలు పెట్టుకొంది. వారి అంచనాలను పటాపంచలు చేస్తూ వైఎస్సార్‌సీపీ రోజురోజుకు పైచేయి సాధిస్తోంది. బీజేపీ పొత్తు ఖరారు కావడంతో సగం దెబ్బ పడగా, కమలాపురం రూరల్‌లో మంచి పట్టున్న సాయినాథశర్మను టీడీపీ దూరం చేసుకుంది. మరోవైపు మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరిపోయారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన వీరశివాకు కనీస మర్యాద దక్కకపోవడం, తుదకు ఆయన స్వగ్రామం కోగటం ప్రచారానికి సైతం ఆహ్వానం లేకపోవడంతో అమీతుమీకి సిద్ధమయ్యారు. ఈ పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీలో చేరిన ఆయన కసిగా పోచిమరెడ్డి రవీంద్రనాథరెడ్డి విజయం కోసం పనిచేస్తున్నారు. అలాగే సాయినాథశర్మ నియోజకవర్గంలో ఉన్న తన సన్నిహితుల మద్దతు వైఎస్సార్‌సీపీకీ కూడగడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కమలాపురంలో టీడీపీ ఆశలకు గండిపడింది. వల్లూరు మండలంలో ఆర్టీసీ చైర్మన్‌ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి ఆధిక్యత నిలుపుకునేందుకోసం విశేషంగా పనిచేస్తున్నారు. చెన్నూరు మండలంలో టీటీడీ బోర్డు మెంబర్‌ మాసీమ బాబు, మాజీ ఎంపీపీ శివరామిరెడ్డి, గుమ్మా రాజేంద్రనాథరెడ్డి త్రయం విశేష కృషి చేస్తోంది. పెండ్లిమర్రి, వీరపునాయునిపల్లె మండలాలు మొదటి నుంచి వైఎస్సార్‌సీపీకి అనువైన మండలాలని విశ్లేషకుల భావన. వైఎస్‌ కుటుంబానికి ప్రత్యక్ష సంబంధాలుండడం, వారి సమీప బంధువులు ప్రచారంలో విస్తృతంగా పాల్గొంటుండటం మరింతగా కలిసి వస్తోంది. ఇక చింతకొమ్మదిన్నె మండలం పోచిమరెడ్డి కుటుంబ రాజకీయ ప్రస్థానానికి తొలి వేదిక కావడం కలిసి వచ్చే అంశం. ఎటు చూసినా కమలాపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి అనువైన పరిస్థితులే కనిపిస్తున్నాయని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

టీడీపీ ప్రచారంలో రాష్ట్రీయ సమాజ్‌ దళ్‌(ఆర్‌) అభ్యర్థి

ఖాదర్‌పల్లెలో ప్రచారంతో పాటు వ్యక్తిపై టీడీపీ కండువా వేసిన వైనం



ఖాదర్‌పల్లెలో షఫీ అనే వ్యక్తికి టీడీపీ కండువా వేస్తున్న రాష్ట్రీయ సమాజ్‌ దళ్‌(ఆర్‌) అభ్యర్థి సుధాకర్‌రెడ్డి

చాపాడు: తెలుగుదేశం పార్టీ మైదుకూరు నియోజకవర్గ అభ్యర్థి పుట్టా సుధాకర్‌ యాదవ్‌ కోసం నిర్వహించే ఎన్నికల ప్రచారంలో రాష్ట్రీయ సమాజ్‌ దళ్‌(ఆర్‌) పార్టీ అభ్యర్థి పీవీ సుధాకర్‌రెడ్డి పాలుపంచుకుంటున్నారు. టీడీపీలో తానే అంతా అనే విధంగా పార్టీలో చేర్పులు, పార్టీ ప్రచారంలో సుధాకర్‌రెడ్డి తలమునకలయ్యారు. మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన పీవీ సుధాకర్‌రెడ్డి ఈ ఎన్నికలలో రాష్ట్రీయ సమాజ్‌ దళ్‌(ఆర్‌) పార్టీ అభ్యర్థిగా పోటీలో నిలిచారు. ఈయనకు ఎన్నికల కమిషన్‌ ఆపిల్‌ గుర్తును కేటాయించింది. అయితే ఎన్నికల కమిషన్‌ నిబంధనలు తుంగలో తొక్కుతూ మంగళవారం మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామంలో జరిగిన టీడీపీ ఎన్నికల ప్రచారంలో యథేచ్ఛగా పాల్గొని తమ పార్టీని పక్కన పెట్టి టీడీపీకి ఓటు వేయాలని కోరారు. ఇదే క్రమంలో గ్రామంలో షఫీ అనే వ్యక్తిని టీడీపీలో చేరుతుండటంతో రాష్ట్రీయ సమాజ్‌ దళ్‌(ఆర్‌) అభ్యర్థి అయిన సుధాకర్‌రెడ్డి స్వయంగా టీడీపీ కండువా షఫీ మెడలో వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. కాగా సుధాకర్‌ రెడ్డి టీడీపీ చాపాడు మండల అధ్యక్షుడిగా ఉన్నారు. పార్టీకి రాజీనామా చేయకుండా రాష్ట్రీయ సమాజ్‌ దళ్‌(ఆర్‌) అభ్యర్థిగా పోటీలో ఉండడంపై ఓటర్లు విస్తుపోతున్నారు. ఇదేం తీరు అని చర్చించుకుంటున్నారు.

సింహ వాహనంపై దేవదేవుడు

వల్లూరు: పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి కామాక్షీ వైద్య నాథేశ్వర స్వామి సింహ వాహనంపై , శ్రీ చెన్న కేశవ స్వామి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ఉదయం శ్రీ వైద్య నాథ స్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. శ్రీ కామాక్షి అమ్మవారికి, శ్రీ చక్రానికి కుంకుమార్చన చేశారు. రాత్రి మంగళ వాయిద్యాలు, దివిటీల వెలుగుల మధ్య స్వామి వారి గ్రామోత్సవాన్ని పుష్పగిరి మాడ వీధుల్లో ఘనంగా నిర్వహించారు. కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు అఖిల్‌ దీక్షితులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలను, తోమాల సేవను నిర్వహించారు. శ్రీ లక్ష్మీదేవికి అర్చనలు నిర్వహించారు. యాగశాలార్చన , చతుస్థానార్చన ,నిత్య హోమము, బలిహరణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సాయంత్రం వివిధ హోమాలను నిర్వహించారు. రాత్రి హంస వాహనం అధిష్ఠించిన చెన్న కేశవ స్వామి వారిని కొండపై నుంచి పెన్నా నది మీదుగా దివిటీల వెలుగులో గ్రామంలోకి తీసుకుని వచ్చి పుష్పగిరి గ్రామ మాడ వీధులలో మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సుమంత్‌ దీక్షితులు, రాజేశ్వర శర్మ , ఉభయ దాతలు పాల్గొన్నారు.

పుష్పగిరిలో నేడు అష్టోత్తర కళశాభిషేకం

బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం పుష్పగిరిలోని శ్రీ వైద్య నాథేశ్వర స్వామి ఆలయంలో ఉదయం రుద్రాభిషేకం, కుంకుమార్చనలు జరుగుతాయి. రాత్రి స్వామివారికి పురుషామృగ వాహన సేవ ఉంటుంది. శ్రీ లక్ష్మీ చెన్న కేశవ ఆలయంలో ఉదయం అష్టోత్తర కళశాభిషేకం జరుగుతుంది. రాత్రి స్వామి వారికి యాళీ వాహన సేవ ఉంటుంది.



సింహ వాహనంపై శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వామి



హంస వాహనంపై శ్రీ చెన్న కేశవ స్వామి

పథకాలు కొనసాగాలంటే జగనన్న రావాలి



బద్వేలు రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే..



గోపవరం మండలంలో ఎంపీ అవినాష్‌రెడ్డి రోడ్‌షోలో పాల్గొన్న ప్రజలు

ఎంపీ వైఎస్‌ అవినాష్‌ రెడ్డి

గోపవరం: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి జగనన్న ప్రభుత్వమే రావాలని, అందుకు ప్రజలందరి ఆశీర్వాదం కావాలని ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం శ్రీనివాసపురం నుంచి బ్రాహ్మణపల్లె వరకు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్‌ సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డిలతో కలిసి ఎంపీ రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలతో పాటు అమ్మఒడి, పింఛన్‌, రైతుభరోసా తదితర పథకాలను మెరుగుపరిచి కొత్త మేనిఫెస్టో విడుదల చేశామని, ఇవన్నీ కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం ప్రజలందరిపై ఉందన్నారు. గోపవరం మండలంలో సెంచరీ పానెల్స్‌ పరిశ్రమ ప్రారంభించిన విషయం మీకందరికి తెలిసిందే అన్నారు. దీంతో దాదాపు 2 వేల మందికి పైగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు ఈ ప్రాంతవాసులకు ఉపాధి దొరికిందని వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా సుధకు, ఎంపీ అభ్యర్థిగా తనకు ఫ్యాన్‌ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

బాబు సాగునీటి ప్రాజెక్టులను సందర్శించడం వల్లే వర్షాలు కురవలేదు

జగనన్న ప్రభుత్వం కొలువుదీరాక వరుసగా మూడేళ్లు రాష్ట్ర వ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు పడ్డాయన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను సందర్శించినప్పటి నుంచి దాదాపు 18 నెలలుగా వర్షాలు పడలేదంటే వరుణదేవుడు కూడా చంద్రబాబుపై కసి కట్టారని ఎంపీ అవినాష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాగానే మళ్లీ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు పడి రైతులంతా ఆనందంగా గడిపే రోజులు రావడం ఖాయమని ఎంపీ ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, నియోజకవర్గ బూత్‌ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వేణుగోపాల్‌ రెడ్డి, పార్టీ నాయకులు కె.సుధాకర్‌ రెడ్డి, వెంకటసుబ్బా రెడ్డి, నరసింహా రెడ్డి, రవిచంద్రా రెడ్డి, హరిక్రిష్ణా రెడ్డి, గోవిందరెడ్డి, కొండారెడ్డి, రాధాక్రిష్ణా రెడ్డి, కె.వెంకటేశ్వర్‌ రెడ్డి, కె.రమణా రెడ్డి, జేసీఎస్‌ కన్వీనర్‌ పుల్లయ్య, శ్రీరాములు, కృష్ణారెడ్డి, మల్లేష్‌ పాల్గొన్నారు.

బాబు బూటకపు హామీలు నమ్మి మోసపోవద్దు

బద్వేలు అర్బన్‌: ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇవ్వడం ... గెలిచిన తర్వాత వాటిని విస్మరించి ప్రజలను మోసగించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, ప్రజలు ఎవరూ కూడా చంద్రబాబు బూటకపు హామీలు నమ్మి మోసపోవద్దని కడప ఎంపీ వైఎస్‌అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బద్వేలు మున్సిపాలిటీలోని 12, 13, 14 వార్డుల పరిధిలో గల శివానగర్‌, ముబారక్‌నగర్‌, మహబూబ్‌నగర్‌, సుమిత్రానగర్‌లలో ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధలతో కలిసి రోడ్‌షో నిర్వహించారు.మున్సిపల్‌ చైర్మన్‌ రాజగోపాల్‌రెడ్డి, కుడా చైర్మన్‌ గురుమోహన్‌, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, అల్లాబకాష్‌, కేశవరెడ్డి, డాక్టర్‌ కళ్యాణ్‌చక్రవర్తి, శీనయ్య, డీఎల్‌డీఏ చైర్మన్‌ మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరెడ్డి, జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, కౌన్సిలర్లు,వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

రైతన్నలకు విత్తన రాయితీ

- 40 నుంచి 50 శాతం రాయితీతో విత్తనాలు
- ఖరీఫ్‌, రబీకి ముందే పంపిణీ చేయడంతో సకాలంలో పంటలసాగు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



సబ్సిడీతో అందించే వేరుశనక్కాయలు

వైఎస్సార్‌జిల్లాలో విత్తన రాయితీలు ఇలా..

సంవత్సరం	విత్తన పంపిణీ (క్వింటాళ్లలో)	రైతుల సంఖ్య	ప్రభుత్వం అందచేసిన రాయితీ (కోట్లలో)
2019–20	95661.73	114633	34.04
2020–21	116050.93	159211	41.99
2021–22	93040.31	119869	36.27
2022–23	46155.69	44976	3.75
2023.24	83696.82	75506	31.21

కడప అగ్రికల్చర్‌: ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్నలకు ఏ కష్టం రాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. దేశంలో మరెక్కడా లేని విధంగా ఆర్‌బీకే వ్యవస్థకు శ్రీకారం చుట్టి అన్నదాత ముంగిటే సంక్షేమ ఫలాలు అందిచింది. ఈ క్రమంలో ఖరీఫ్‌, రబీలలో రైతులు తమ పంటలసాగుకు విత్తనాల కోసం ఏరకమైనా ఇబ్బందులు పడకుండా ఉన్న ఊరు దాటకుండా ఊరిలోని రైతు భరోసా కేంద్రం వేదికగా సకాలంలో రాయితీ విత్తనాలను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా వేరుశనగ, శనగలు, కందులు పచ్చిరొట్ట విత్తనాలు, పెసలు తదితర విత్తనాలను ఐదేళ్లలో 5,14,195 మంది రైతులకు రూ.147.26 కోట్లు మేర సబ్సిడీని ప్రభుత్వం అందచేసింది. దీంతోపాటు 4.43 లక్షల క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలను రైతులకు అందచేసింది. ఇలా సకాలంలో రైతులకు విత్తనాలను పంపిణీ చేయడంతో లక్షల ఎకరాల్లో ఖరీఫ్‌, రబీ సీజన్‌లలో పంటలను సాగు చేసుకునేందుకు వీలు కలిగింది. దీంతో అన్నదాతలు ఈ ఐదేళ్లలో వ్యవసాయాన్ని పండగలా చేసుకున్నారు.

గతంలో పోరాటమే....

చంద్రబాబు హయాంలో విత్తనాలు కావాలంటే పెద్దపోరాటమే చేయాల్సిన పరిస్థితి నెలకొనేది. మారు మూల గ్రామాల నుంచి కిలోమీటర్ల దూరంలో ఉండే మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన విత్తన పంపిణీ కేంద్రాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎర్రటి ఎండలో బారులు తీరితేకానీ రైతులకు కావాల్సిన విత్తనాలు దొరికేవి కాదు. ఒక్కోసారి విత్తనాలు దొరక్క పంపిణీ కేంద్రాలకు వేకువజామునే పనులన్నీ వదులుకుని చేరుకుని క్యూలైన్లో గంటలు తరబడి నిలబడలేక చెప్పులు, టవళ్లను క్యూలైన్లలో ఉంచి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. వేరుశనగ, శనగ, పచ్చిరొట్ట సబ్సిడీ విత్తనాల పంపిణీ అనగానే రైతులతోపాటు అధికారుల గుండెలు గుబేల్‌ మనే పరిస్థితి నెలకునేది. కానీ 2019 నుంచి ఆ పరిస్థితి లేదు. విత్తనాలు రాగానే రైతులు నేరుగా రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పేర్లను నమోదు చేసుకుని విత్తనాలను సులభంగా ఇంటికి తెచ్చుకునే పరిస్థితి ఉంది. దీంతోపాటు నాణ్యతలో ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకుండా సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేయడంతో రైతున్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

యువకుడు అదృశ్యం


ఉమాపతిరెడ్డి (ఫైల్)

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన యువకుడు గొకనపల్లె ఉమాపతిరెడ్డి అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు 29 ఏళ్ల వయసు గల ఉమాపతిరెడ్డి ఈ నెల 5వ తేదీ ఉదయం ఐదు గంటల సమయంలో మోటార్ బైక్‌లో ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు చుట్టు ప్రక్కల విచారించారు. ఆచూకీ తెలియకపోవడంతో అతని తండ్రి వెంకటసుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కోర్టు ఉద్యోగికి తీవ్రగాయాలు

కడప అర్బన్ : కడపలోని ఏడురోడ్ల కూడలిలో స్కూటీపై వెళుతున్న జి. వెంకటసుబ్బారెడ్డి (43) అనే వ్యక్తిని, ఆటో వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తి బద్వేల్ కోర్టులో స్టెనోగా పనిచేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అతన్ని స్థానికులు రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

డబ్బులు పంచుతున్న ఇద్దరిపై కేసు

కడప అర్బన్ : కడపలోని రాజారెడ్డి వీధిలో మంగళవారం టీడీపీ తరఫున ఓటర్లను ప్రలోభపెట్టేందుకు స్లిప్‌లను ఇచ్చి, డబ్బులను పంచుతున్న బొజ్జా వెంకట మంజునాథరెడ్డి, పసల జయంత్‌లపై ఎస్ఐ రంగస్వామి కేసు నమోదు చేశారు. మొదటి నిందితుడి దగ్గరి నుంచి రూ. 3500 నగదును, స్లిప్‌లను ఎస్ఐ సీజ్ చేశారు.

బ్యాంకు పైనుంచి పడి యువకుడు మృతి


సూరజ్ కుమార్ (ఫైల్)

కమలాపురం : బ్యాంకుపై నుంచి ప్రమాదవశాత్తూ కింద పడి సూరజ్ కుమార్(19) మృతి చెందినట్లు ఎస్ఐ హృషి కేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు...యూపీ రాష్ట్రం, మహారాజ్ గంజ్ జిల్లాకు చెందిన సూరజ్ కుమార్ అదే ప్రాంతానికి చెందిన మరి కొందరితో కలిసి కమలాపురంలో కార్పెంటర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కమలాపురం ఎస్‌బీఐ నందు కార్పెంటర్ పనులు చేస్తూ రాత్రి వేళలో తన సహచరులతో కలిసి బ్యాంక్ భవనం పైనే పడుకుంటున్నారు. సోమవారం రాత్రి కూడా మృతుడితోపాటు అతని సహచరులు బ్యాంక్ భవనం పైనే పడుకున్నారు. అయితే మృతుడు ఫోన్‌లో మాట్లాడుతూ, ప్రమాదవశాత్తూ కాలు జారి అదుపు తప్పి కింద పడి కోలుకోలేక అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్ఐ వివరించారు. మృతుని మరణంపై ఎలాంటి అనుమానాలు, సందేహాలు లేవన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ


వైఎస్సార్‌సీపీలో చేరిన మైనార్టీ కుటుంబాలతో ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే


బి.కోడూరు : పార్టీలో చేరిన వారితో ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

బద్వేలు అర్బన్ : ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో గల సుందరయ్యకాలనీలో మంగళవారం టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లాబకాష్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఉమర్‌ల ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన నాయబ్‌రసూల్‌తో పాటు 100 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. పార్టీలో చేరిన వారికి ఎంపీ వైఎస్‌అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సుందరయ్యకాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే ముస్లింల సంక్షేమం సాధ్యమవుతుందని అన్నారు. మహానేత డాక్టర్ వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ విద్య, ఉద్యోగ అవకాశాల్లో 4 శాతం రిజర్వేషన్ కల్పించారని, ఆ రిజర్వేషన్‌ను ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి కొనసాగిస్తూ వస్తున్నారని అన్నారు. మైనార్టీలకు గుర్తింపు ఇచ్చిన ఏకైక నాయకుడు సీఎం జగన్ ప్రతి ముస్లిం హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. గెలిచిన వెంటనే డిప్యూటీ సీఎంగా అంజాద్‌బాషాను చేశారని, అలాగే రాష్ట్రంలో 5 అసెంబ్లీ స్థానాలు ముస్లింలకు కేటాయించి అందులో ఒకరు ఓడిపోతే ఆయనకు సైతం ఎమ్మెల్సీగా చేసి ముస్లింలపై తన ప్రేమ చాటుకున్నారని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మైనార్టీలను కేవలం ఓటుబ్యాంకుగా చూస్తూ వారి వెనుకబాటుకు చంద్రబాబు కారణమయ్యారని, ఆయన హయాంలో మైనార్టీశాఖను సైతం ఇతర కులాల వారికి ఇచ్చి మైనార్టీలను అవమానపరిచారని గుర్తుచేశారు. అంతేకాకుండా అధికారంలో కోసం మతతత్వ పార్టీ అయిన బీజేపీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు మరోసారి మైనార్టీలను మోసగించేందుకు సిద్ధమయ్యారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు నిమ్మకాయలసుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ఆదిత్యరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మదీనా దస్తగిరి, కుడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, కేశవరెడ్డి, కౌన్సిలర్ హసన్, మైనార్టీ నాయకులు బాబ్జీ, మౌలాలి, షఫి, నూరుల్లా, మహబూబ్‌బాష, ఖాదర్ బాష, జబీవుల్లా, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, పెద్ద ఎత్తున మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

బి.కోడూరు మండలంలో..

బి.కోడూరు : మండలంలోని అమ్మవారిపేట గ్రామానికి చెందిన 30 కుటుంబాలు ఎంపీ వైఎస్‌అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల సమక్షంలో మంగళవారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. నాగభూషణం, శ్రీనులతో పాటు 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. బద్వేలులోని రఫి రైస్‌మిల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వలన ప్రజలు లబ్ధిపొందారని, వలంటరీ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను ఇంటింటికి అందించి మాలాంటి పేదవారు ఆర్థికంగా బలపడేందుకు కృషి చేస్తున్నారన్నారు. అందుకు ఆకర్షితులమై పార్టీలో చేరామన్నారు. 40 ఏళ్లుగా టీడీపీని నమ్ముకుని, జెండాలు మోసి పార్టీకి ఎన్నో సేవలు చేసినా ఎలాంటి లబ్ధి చేకూరలేదన్నారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ఆదిత్యరెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ యోగానందరెడ్డి, మాజీ సర్పంచ్‌లు తిరుపతిరెడ్డి, లక్ష్మీనరసారెడ్డి, మున్నెల్లి ఉప సర్పంచ్ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబు ఫిర్యాదుతోనే సంక్షేమ పథకాలు ఆగాయి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : చంద్రబాబు ఫిర్యాదుతోనే రాష్ట్రంలో తాత్కాలికంగా సంక్షేమ పథకాల లబ్ధిదారులకు నిధుల జమ నిలిచిపోయిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్ చేయూత, ఆసరా, ఈబీసీ నేస్తం, రైతు భరోసా లాంటి పథకాలు అమలవుతున్నాయన్నారు. కరోనా సమయంలోనూ పేదల జీవితాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించిందన్నారు. ప్రస్తుతం చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కినా ఎన్నికల కమిషన్ అభ్యంతరం తెలుపడంతో లబ్ధిదారుల ఖాతాలో డబ్బు జమ కాలేదన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి 500 డ్వాక్రా గ్రూపులకుపైగా వైఎస్సార్ ఆసరా ద్వారా డబ్బు జమ చేయాల్సి ఉందన్నారు. ఎన్నికలు ముగిశాక యథావిధిగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు జమవుతుందన్నారు.

మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోండి

ఓటర్లందరూ జాగ్రత్తగా ఆలోచించి తమకు మంచి చేసే ప్రభుత్వాన్నే ఎన్నుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. అభివృద్ధి పనులు ఎవరు చేపట్టారు? ఎవరు పేదల కోసం సంక్షేమ పథకాలు అందించారు? ప్రజలకు తాగునీరు ఎవరు అందించారు? రోడ్లు, కాలువలు ఎవరు అభివృద్ధి చేశారని సున్నితంగా పరిశీలించాలన్నారు. విజ్ఞులైన ఓటర్లు మంచి చేసిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన వాహనం

ముగ్గురికి గాయాలు

కొండాపురం : మండలంలోని లానూరు గ్రామంలో ఓ బొలెరో వాహనం అదుపుతప్పి శ్రీ విఘ్నేశ్వర హోటల్‌లోకి దూసుకెళ్లిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకొంది. మంగ్లవారం కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తెలిపిన వివరాల మేరకు పైడిపాళెం రిజర్వాయర్ నుంచి సింహాద్రిపురం వెళ్లుతున్న వాహనం అదుపుతప్పి హోటల్ లోపలికి దూసుకెళ్లడంతో హోటల్ యజమాని మాదవి అక్కడే కూర్చొన్న రమేష్‌నాయుడు, వెంకటరామిరెడ్డిలు గాయాలపాలయ్యారని చెప్పారు. రమేష్‌నాయుడును హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్ఈబీ సీఐ జయరామనాయుడు, సిబ్బంది

మైదుకూరు : మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో మంగళవారం అక్రమంగా నిల్వ ఉంచిన 42 కేసుల తెలంగాణ మద్యాన్ని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బ్రహ్మంగారిమఠంలో యాదవ నగర్ సమీపంలోని ఓ పొలంలో గడ్డివాము మాటున దాచి ఉంచిన 42 పెట్టెల్లో ఉన్న 2,016 క్వార్టర్ బాటిళ్లను ఎస్ఈబీ సీఐ జయరామనాయుడు, సిబ్బంది సీజ్ చేశారు. బి.మఠానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు వారం రోజుల కిందట ఓ ట్రక్కులో మద్యాన్ని తెప్పించినట్టు తెలుస్తోంది. అందులో 60 కేసులను ఇప్పటికే గ్రామాలకు తరలించినట్టు సమాచారం. మద్యాన్ని నిల్వ ఉన్న చోటు నుంచి ఇతర చోట్లకు తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో మంగళవారం ఎస్ఈబీ అధికారులు దాడులు చేశారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని మైదుకూరులోని కార్యాలయానికి తరలించారు. బి.మఠంలో టీడీపీ నాయకులు మరిన్ని చోట్ల మద్యం నిల్వలు ఉంచినట్టు సమాచారం రావడంతో ఎస్ఈబీ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. మద్యం స్వాధీనం విషయంపై ఎస్ఈబీ సీఐను వివరణ కోరగా బ్రహ్మంగారిమఠం యాదవ నగర్ సమీపంలో గడ్డివాము మాటున ఉన్న 42 కేసుల తెలంగాణ మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. కేసును విచారించి నిందితులను అరెస్టు అదుపులోకి తీసుకుంటామని తెలియజేశారు.

తెలుగు యువత నాయకుల రాజీనామా


టీడీపీ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌తో రాటకొండ హర్షవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి

మదనపల్లె : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మదనపల్లె టీడీపీకి గట్టి షాక్ తగిలింది. నియోజకవర్గంలో టీడీపీకి పెద్ద దిక్కుగా ఉంటున్న టీడీపీ సీనియర్ నాయకులు రాటకొండ బాబురెడ్డి, మాజీ ఎమ్మెల్యే శోభల ఇద్దరు కుమారులు పార్టీ పదవులకు రాజీనామా చేయడం ఆ పార్టీ శ్రేణులను కలవరపాటుకు గురిచేసింది. రాటకొండ కుటుంబానికి చెందిన తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి రాటకొండ హర్షవర్ధన్‌రెడ్డి, తెలుగు యువత రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రాటకొండ విష్ణువర్ధన్‌రెడ్డి మంగళవారం తమ రాజీనామా లేఖలను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబుకు పోస్టు ద్వారా పంపారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ... పట్టణంలో ఇటీవల జరిగిన తెలుగు యువత సమావేశంలో ప్రోటోకాల్ పాటించకుండా, ఇష్టానుసారంగా సమావేశాన్ని నిర్వహించారన్నారు. కార్యక్రమ నిర్వహణ సక్రమంగా చేయకపోగా, అకారణంగా తమపై నిందలు మోపుతూ, అవమానాలకు గురిచేశారన్నారు. 20 ఏళ్లుగా తమ కుటుంబాన్ని రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ పార్టీ నాయకులు అవమానాలకు గురిచేస్తూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ రాజీనామా లేఖలను ఆమోదించి, టీడీపీ తెలుగు యువత పదవుల నుంచి రిలీవ్ చేసి నోట్ పంపాల్సిందిగా కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే రాజకీయ ప్రయాణం

– పార్టీ మారుతున్నా అంటూ వస్తున్న పుకార్లపై స్పందించిన నల్లారి తిమ్మారెడ్డి



కలికిరి : పార్టీ మారుతున్నట్లు వచ్చిన వదంతులపై మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. గత రెండు రోజులుగా పీఎం మోదీ సమక్షంలో బీజేపీ కూటమిలో చేరుతున్నట్లు వదంతులు వచ్చిన సందర్భంగా ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ తన సోదరుడు నల్లారి అమరనాథరెడ్డి మరణంతోనే తనకు, మిగిలిన నల్లారి కుటుంబ సభ్యులతో రాజకీయ విభేదాలు వచ్చాయని, నాటి నుంచి రాజకీయంగా వేర్వేరుగా ఉంటున్నామన్నారు. అటువంటిది అప్పుడు తాను వారి చెంత చేరుతానని పుకార్లు పుట్టించడం దారుణమన్నారు. అంతేకాకుండా పత్తేగడ గ్రామంలో తన అనుచరుల పట్ల టీడీపీ కూటమి నేతలు బెదిరింపులకు దిగుతున్నారని, ఇలాంటి పద్ధతులకు స్వస్తి చెప్పకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఎప్పుడూ తన స్థాయికి తగ్గ గౌరవం ఇస్తున్నారని, వారి వెంటే తన రాజకీయ ప్రయాణం ఉంటుందని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

దళితులపై టీడీపీ నాయకుల దౌర్జన్యం


టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డిని ప్రశ్నిస్తున్న విజయకుమార్

తంబళ్లపల్లె : కన్నెమడుగు పంచాయతీలో మంగళవారం ఎన్డీయే కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి ఎన్నికల ప్రచారానికి వచ్చారు. కన్నెమడుగు దళితవాడలో ప్రచారం చేస్తుండగా దళితులు నిలదీశారు. దీంతో వారిపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. బాధితుల కథనం మేరకు వివరాలు.. కె.విజయకుమార్ అనే యువకుడు కరోనా కష్టకాలంలో మా వైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దగ్గర ఉండి అన్ని సౌకర్యాలు కల్పించి రోడ్డు సౌకర్యాలు, కొళాయిల ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించారు. ఆయనకే ఓటు వేస్తామని మీకెందుకు ఓటు వేయాలని జయచంద్రారెడ్డిని నిలదీశారు. దీంతో జయచంద్రారెడ్డి సమాధానం ఏమి చెప్పాలో దిక్కుతోచక ఖంగుతున్నాడు. ఇంతలో జయచంద్రారెడ్డి వెంట ఉన్న నాయకులు, కార్యకర్తలు ఆగ్రహంతో విజయ్‌కుమార్‌ను చుట్టుముట్టారు. అతని బాబాయ్ చిన్నప్ప, పిన్ని ధనమ్మలు ఎందుకు దౌర్జన్యానికి దిగుతున్నారని ప్రశ్నించడంతో వారిపై కూడా తూలనాడారు.

కుక్క కరిచిందని ఇరువర్గాల ఘర్షణ

నిమ్మనపల్లె : పిల్లాడిని కుక్క కరిచిందని ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. మండలంలోని రెడ్డివారి పల్లి పంచాయతీ సోమానపల్లె కాలనీకి చెందిన రెడ్డప్ప భార్య మల్లేశ్వరి తమ బంధువుల పిల్లవాడైన హర్ష (08)ను, అదే గ్రామంలోని గోపికి చెందిన కుక్క కరిచి గాయపరిచింది. ఈ విషయమై మల్లేశ్వరి భర్త రెడ్డప్ప, గోపి వాళ్లను ప్రశ్నించడంతో గొడవ ముదిరి దాడికి దారితీసింది. దాడిలో ఒక వర్గంలోని రెడ్డప్ప, మరో వర్గంలో గోపి కుమారుడు బాలు (21)గాయపడ్డారు. ఇరువర్గాలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేయడంతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జగన్ పాలనలో ముస్లింలకు ప్రాధాన్యత


మాట్లాడుతున్న మహమ్మద్ మాలిక్

బి.కొత్తకోట : జగన్ పాలనలోనే ముస్లింలకు ప్రాధాన్యత లభిస్తోందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ మాలిక్ అన్నారు. మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముస్లిల అభివృద్ధికి చంద్రబాబు ఏనాడు కృషి చేసింది లేదన్నారు. సంక్షేమ పథకాలతో జగన్ మైనార్టీల ఆర్థికాభివృద్ధికి దోహదం చేశారన్నారు. ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ స్థానాల్లో ముస్లింలకు అవకాశం కల్పించి పోటీ చేయిస్తున్నారని అన్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముస్లీంలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పిస్తే జగన్ దాన్ని కాపాడుతూ విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. బీజేపీతో జతకట్టిన చంద్రబాబు కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్ఆర్‌సీ, సీఏఏ, యూసీసీ చట్టాల నుంచి ముస్లీంలకు రక్షణ ఇస్తామని ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ముస్లింలకు అన్యాయం చేస్తున్న చంద్రబాబును ఎన్నికల్లో ఓడించాలని కోరారు. జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుంటేనే అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతుందని, లేదంటే ప్రజలు నష్టపోతారని అన్నారు. సమావేశంలో స్కూల్ కమిటి చైర్మన్ ఇబ్రహీం, మహమ్మద్‌గౌస్, సాదిక్‌వలీ, అయూబ్‌ఖాన్, ఖాదర్‌హుసేన్, కరీముల్లా పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన చేనేత కార్మికుడి మృతి


అశోక్‌బాబు(ఫైల్)

మదనపల్లె : చేనేత మగ్గం యజమాని వేధింపులతో కార్మికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. మదనపల్లి పట్టణం చౌడేశ్వరి నగర్ లో నివాసమున్న రెడ్డప్ప కుమారుడు చల్ల అశోక్ బాబు (34), స్థానికుడైన ఎరుకులరెడ్డి వద్ద చేనేత కార్మికుడిగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. అతని భార్య రెడ్డిరాణి ఉపాధి నిమిత్తం కువైట్లో ఉంటుంది. అశోక్ బాబు ప్రతిరోజు పనికి వెళ్లేవాడు. ఈ క్రమంలో ఏప్రిల్ 30వ తేదీన చేనేత మగ్గాల యజమాని ఎరుకల రెడ్డి, అతని అనుచరులు చలపతి, రాజేష్, సుధా తదితరులు వ్యక్తిగత కారణాలతో అశోక్ బాబుపై దాడి చేసి తీవ్రంగా కొట్టి గాయపరిచారు. నువ్వు చావకపోతే మేమే చంపేస్తామంటూ బెదిరించారు. దీంతో మనస్తాపం చెందిన అశోక్ బాబు ఈనెల రెండో తేదీన ఇంటి వద్ద నిద్ర మాత్రలు మింగాడు. స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బాధితున్ని తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. అశోక్ చిన్నాన్న వీరభద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సిఐ శేఖర్ తెలిపారు.

ప్రచారరథం సీజ్, డ్రైవర్‌పై కేసు

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెవన్‌రోడ్స్ వద్ద అనుమతికి మించిన సౌండ్ బాక్స్‌లను పెట్టుకుని మంగళవారం ప్రచార రథం ఒకటి వెళుతోందని ఫ్లైయింగ్ స్క్వాడ్ విభాగం అధికారి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ విశ్వనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ భాస్కర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. ప్రచార రథంను సీజ్ చేశారు.

రాయితో దాడి

– వ్యక్తికి గాయాలు


గాయపడిన రైతు సుధాకర్

మదనపల్లె : రాయితో దాడి చేయడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం పట్టణంలో జరిగింది. మండలంలోని పూతబో లు పంచాయతీ దిగువ గాండ్లపల్లి కు చెందిన జి సుధాకర్ (50) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వచ్చి తిరిగి వెళుతుండగా, సీటీఎం రోడ్డులోని రెడ్డప్ప నాయుడు కాలనీ వద్ద, అదే గ్రామానికి చెందిన వెంకటరమణ రాయితో దాడి చేయడంతో, రైతుసుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే బాధితుని ఆటోలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి



సంబేపల్లె : మండలంలోని ఎస్.సోమవరం గ్రామంలో గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 15 గొర్రెలు మృతి చెందాయి. బాధితుల వివరాల మేరకు.. ఎస్.సోమవరం పంచాయతీకి చెందిన గుది సుధాకర్ గొర్రెలను పొలం వద్ద వదలగా, మంగళవారం కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో 15 గొర్రెలు మృతి చెందగా, మరో 14 గొర్రెలు గాయపడ్డాయి. గాయపడిన వాటికి వెటర్నరీ సిబ్బంది చికిత్స నిర్వహించారు.

గొంతులో పొడుచుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న బాలసుబ్రమణ్యం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి గొంతులో పొడుచుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం తంబళ్లపల్లెలో జరిగింది. స్థానికంగా నివాసం ఉన్న చిట్టెం వెంకటరమణ కుమారుడు బాలసుబ్రమణ్యం (45), రాజస్థాన్ రాష్ట్రంలో ప్రైవేట్ సెక్టార్ లో సివిల్ ఇంజనీర్ గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఇంటి వద్ద కుటుంబ సమస్యల కారణంగా మనస్థాపం చెంది, కత్తితో గొంతులో పొడుచుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం బాధితుడు కోలుకుంటున్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


తీవ్ర గాయాలపాలైన తుమ్మల వెంకటరమణ

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని మర్రిచెట్టు – కుర్నూతల రోడ్డు మార్గంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలుకాగా ఒకరి పరిస్థితి విషమించడంతో 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలించినట్లు లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. మండలంలోని మద్దిరేవుల గ్రామం ఈడిగపల్లెకు చెందిన తుమ్మల వెంకటరమణ, సంబేపల్లె మండలం ఎర్రగుంట్ల గ్రామం మద్దులోల్లపల్లెకు చెందిన మండెం శ్రీనివాసులు మద్దిరేవుల గ్రామం జీఆర్ కాలనీలోని తన అత్తారింటికి వచ్చారు. వీరు ద్విచక్ర వాహనంలో లక్కిరెడ్డిపల్లెకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గాయాలపాలైన వారిని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్ తరలించారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

నిమ్మనపల్లె : బాకీ విషయమై వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. కొండయ్య గారి పల్లె పంచాయతీ వెంకోజి గారి పల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు రవికుమార్ (35), రెడ్డి వారి పల్లి పంచాయతీ చలిమామిడి హరిజనవాడకు చెందిన రామచంద్ర వద్ద పదివేల రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. వారానికి వెయ్యి రూపాయల చొప్పున తిరిగి చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. అందులో భాగంగా రవికుమార్ ఐదు వారాలు అప్పు చెల్లించాడు. అయితే సోమవారం నిమ్మనపల్లి నుంచి మదనపల్లి కు ఆటోలో వెళ్తున్న రవికుమార్ ను కొండయ్య గారి పల్లె కోళ్ల ఫారం వద్ద రామచంద్ర అతని కుమారుడు గౌతమ్ బంధువు చంద్ర ముగ్గురు కలిసి అడ్డగించి ఆటోలో నుంచి దింపి వేశారు. మిగిలిన బాకీ మొత్తం ఇప్పుడే చెల్లించాలంటూ గొడవకు దిగారు. అంతేకాకుండా రాడ్డుతో రవికుమార్‌పై దాడి చేశారు. దాడిలో రవికుమార్ తలకు తీవ్ర గాయమై మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుని ఫిర్యాదు మేరకు నిందితులు ముగ్గురిపై హెడ్ కానిస్టేబుల్ శివరామకృష్ణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.